

రేపు గాజుల మహోత్సవం

ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గాజుల మహోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీన వివిధ రంగుల గాజుల అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయం మొత్తం గాజులతో అలంకరించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఈవో శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేస్తున్నారు.

6లో



ఇంటింటా దీపావళి

జిల్లాలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం ఉదయం నుంచే పండుగ సందడి మొదలైంది. గృహాలను అందంగా అలంకరించుకుని, వాహనాలను శుభ్రం చేసుకుని ప్రజలు భక్తితో లక్ష్మీదేవిని కొలిచారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ సంతోషంగా గడిపారు. బాణసంచా వెలుగుల్లో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ గుడి దేదీప్యమానంగా కాంతులీనింది.

6లో

వాయుగండం!

రెండు రోజులపాటు దక్షిణ కోస్తాతీరం వెంబడి భారీవర్షాలు

బంగాళాఖాతంలో సముద్ర నీటి మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తున అల్పపీడన ద్రోణి కేంద్రీకృతం

జిల్లా వాసులను వాయుగుండం వణికిస్తోంది. సముద్ర నీటిమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తున బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి మరింతగా బలపడటంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మంగళవారం పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం నాటికి అల్పపీడన ద్రోణి మరింతగా బలపడి వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తాతీరం వెంబడి రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఈ నెల 25వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది.

- నేడు వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరిక
- 25వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు
- వరిని వెంటాడుతున్న తెగుళ్ల బెడద
- ఆరెంజ్ అలర్ట్ జారీ





వరికి పొంచి ఉన్న ముప్పు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా వాసులకు వాయుగుండం ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి మరింత బలపడటంతో భారీ వర్షాలు పడనున్నాయి. గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గాలిలో తేమశాతం పెరిగింది. దీంతో కోతకు సిద్ధంగా, కంకులు పాలు పోసుకునే దశలో ఉన్న వరికి తెగుళ్ల బెడద అధికమవుతుందని రైతులు చెబుతున్నారు. పురుగులతో పాటు, దోమపోటు అధికమైతే వరి దుబ్బులు బలహీన పడతాయని రైతులు అంటున్నారు. వర్షం కురిస్తే తెగుళ్ల నివారణకు పురుగు మందులు స్ప్రే చేయడానికి అవకాశం ఉండదని చెబుతున్నారు. వాయుగుండం ప్రభావంతో భారీ వర్షంతో పాటు, సముద్ర తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న నాలుగైదు రోజుల పాటు ఎలాంటి విపత్తును చూడాల్సి వస్తుందోననే భయం రైతులను వెంటాడుతోంది. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో వరిపైరుకు ఎలాంటి ఇబ్బంది లేదని, రానున్న రోజుల్లో భారీ వర్షాలకు తోడు బలమైన గాలులు వీస్తే, ఈత దశలోఉన్న వరికి సుంకు రాలిపోతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం పలుచోట్ల కంకులు పాలుపోసుకునే దశలో, మరికొన్ని చోట్ల కోతకు సిద్ధంగా వరి ఉందని చెబుతున్నారు. వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిస్తే పైరు నేలవాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీలు

వర్షాలు కురుస్తుండటంతో ప్రధాన పంట కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. వర్షం కారణంగా ప్రధాన డ్రెయిన్‌లు గుండేరు, లజ్జబండ, వడ్లమన్నాడు, ఉప్పుటేరు తదితర డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. దివిసీమలోని కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం సౌత్ మండలంలోని పంట పొలాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకువస్తోంది. కోడూరు మండలంలోని హంసలదీవి, దింటిమెరక, పాలకాయతిప్ప, ఊటగుండం గ్రామాలకు ఈస్ట్ చానల్ 14-బి, 15, 17, 18 నెంబర్ల పంట కాల్వల ద్వారా సాగునీరు విడుదల అవుతుంది. కోడూరుతో పాటు నాగాయలంక మండలం సముద్రతీరంలోని గ్రామాల పరిధిలోని సముద్రపు కరకట్టకు ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు గేట్లు అమర్చకపోవడంతో సముద్రపు ఆటు

మిగతా 6లో..

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- మంత్రి కొల్లు రవీంద్ర
- ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం



అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు

మచిలీపట్నం టౌన్ , అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడుతో కలిసి మంత్రి శ్రద్ధాంజలి

మిగతా 6లో..

కొండపల్లి శ్రీనివాసరావు... ఈ పేరు బయటి ప్రపంచానికి పెద్దగా తెలియకపోవచ్చు. వాణిజ్య పన్నుల శాఖలో అధికారులు, సిబ్బంది, వ్యాపార వర్గాలకు మాత్రం బాగా తెలుసు. అవినీతికి ఈ పేరు ఒక బ్రాండ్. కొంతమంది అధికారులకు బాగా ఇష్టమైన పేరు కూడా. ఇటీవల ఏసీబీ అధికారులకు చిక్కిన సబార్డినేటే ఈ కొండపల్లి శ్రీనివాసరావు. లంచాల కోసం వ్యాపార వర్గాలను పీడించాడు. తాను ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా సాగడానికి అధికారుల పేర్లు ఉపయోగించి తోటి ఉద్యోగులను సైతం వేధించాడు. ఇంతకాలం గోప్యంగా ఉన్న కొండపల్లి శ్రీనివాసరావు ఆగడాలు, చేష్టలు తాజాగా ఆయన ఏసీబీకి చిక్కిన తర్వాత ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

అరాచకాల కొండ!

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి తీరుపై విమర్శలు

- అనధికారికంగా విదేశీ పర్యటనలు
- మర్నాడు విధులకు ముందురోజే సంతకాలు
- వ్యాపార వర్గాల నుంచి మామూళ్లు వసూలు
- తోటి ఉద్యోగులపై వేధింపులు
- సబార్డినేట్ కొండపల్లి శ్రీనివాసరావు అరాచకాలు వెలుగులోకి..



కొండపల్లి శ్రీనివాసరావు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పైఅధికారులు చెప్పిన పని కింది స్థాయి ఉద్యోగులు చేస్తుంటారు. వాణిజ్య పన్నుల శాఖలో మాత్రం పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. సబార్డినేట్‌గా ఉన్న కొండపల్లి శ్రీనివాసరావు ఏ పని చెప్పినా కొంతమంది అధికారులు ఎలాంటి ఆలోచన లేకుండా చేసి పెట్టారని ఆ శాఖ మొత్తం చెప్పుకుంటున్నారు.

అనధికార విదేశీయానాలు

కొండపల్లి శ్రీనివాసరావు కుమారుడు, కుమార్తె విదేశాల్లో ఉంటున్నారు. ఒకరు ఇంజనీరింగ్, మరొకరు మెడిసిన్ చదువుతున్నారు. వారి వద్దకు శ్రీనివాసరావు ఏడాదిలో రెండు సార్లు వెళ్లి వస్తుంటారు. దీనికి ఉన్నతాధికారుల అనుమతులు ఉండవు. అలాగని వారికి సమాచారం ఉండదు. నిబంధనల ప్రకారం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి విదేశాలకు వెళ్లేటప్పుడు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఆ పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాలి. వాణిజ్య పన్నుల శాఖలో ఎవరైనా కిందిస్థాయి ఉద్యోగి విదేశాలకు వెళ్లాలంటే సంబంధిత సర్కిల్ సీటీవో ద్వారా డివిజన్ సంయుక్త కమిషనర్‌కు ప్రతిపాదన వెళ్లాలి. విదేశాలకు వెళ్లడానికి నిధులు ఎలా సమకూరాయి, అక్కడ ఎవరు ఉంటున్నారు, ఎవరి వద్ద బస చేస్తున్నారు అన్న వివరాలతోపాటు విదేశీ ప్రయాణానికి సంబంధించిన విమాన టికెట్ల ఫొటోస్టాట్ కాపీలను అధికారులకు సమర్పించాలి. వాణిజ్య పన్నుల శాఖ కింది,

మిగతా 6లో..

జరిమానాల మోత!

మల్లవల్లి పారిశ్రామికవాడలో ఏపీఐఐసీ అధికారుల అత్యుత్సాహం

- పనులు చేపడుతున్న సంస్థలకు భారీ జరిమానాలు
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బంది పడ్డ సంస్థలపైనే భారం!
- బ్యాలెన్స్ పనులు పూర్తి చేస్తున్న 198 సంస్థలకు నోటీసులు
- ప్రోత్సాహకాలు అందించాల్సింది పోయి.. జరిమానాలేమిటని చర్చ
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బాధితులుగా మారిన పారిశ్రామికవేత్తల విషయంలో ఏపీఐఐసీ అధికారులు ఇంకా పాత వైఖరిని కొనసాగించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా సరే.. భారీగా జరిమానాలు విధించి వారిని వేధిస్తున్నారు. సంస్థలు తమకు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ) ఇవ్వాలని కోరుతుంటే అధికారులు మాత్రం మరింత భారం మోపుతున్నారు. దీంతో ఇప్పటికే పనులు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న వారికి అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పడ్డాయి. 198 ఎంఎస్ఎంఈ యూనిట్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ యూనిట్లన్నీ భూముల కోసం కాకుండా.. పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్న కోణంతోనే ఇక్కడికి వచ్చాయి. దురదృష్టం ఏమిటంటే.. ఈ 198 పారిశ్రామిక యూనిట్లు కూడా గత వైసీపీ ప్రభుత్వ హయంలో బాధిత సంస్థలుగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టిన ఈ సంస్థలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస సహకారం కూడా అందలేదు. ఏపీఐఐసీ అధికారులు ఈ సంస్థలకు అంతకు ముందుగానే రోడ్లు వేసి అప్పగించినా.. రైతుల ఆందోళనల కారణంగా పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యలను అప్పట్లో వైసీపీ ప్రభుత్వం పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. దీంతో రోడ్లు వేసినా వాటిని రైతులు అడ్డంగా తవ్వేయటం, అడ్డంకులను సృష్టించటం వంటి కారణాల వల్ల పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయటంలో ఆయా సంస్థలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు పడిన ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. ఈ విషయం ఏపీఐఐసీ అధికారులకు కూడా తెలుసు. ఈవోటీ అంటే నిర్దేశిత పనులు పూర్తి కావటానికి కొంత సమయం కోరటం. ఈవోటీ కోరటం తప్పు ఎలా అవుతుందో అధికారులే చెప్పాలి.

ఓ సంస్థకు రూ.50 లక్షల జరిమానా!

మధ్య తరహా పరిశ్రమల విషయంలో ఓ సంస్థకు రూ.50 లక్షల జరిమానా విధించారు. ఆ సంస్థ ఇప్పటికే మొత్తం ఐదు యూనిట్లకు గాను మూడు యూనిట్లను ఏర్పాటు చేసింది. నాలుగో యూనిట్‌కు సంబంధించి సివిల్ పనులు పూర్తయ్యాయి. ఐదో యూనిట్‌కు సంబంధించి ఎర్త్ వర్క్ జరుగుతోంది. ఇలాంటి పరిశ్రమకు తగినంత సమయం ఇస్తే ఆ సమయంలోపు మిగిలిన వాటిని కూడా పూర్తి చేసి ఉత్పాదకతను ప్రారంభిస్తుంది. ఉపాధి అవకాశాలు కూడా వస్తాయి. కానీ, ఆ సంస్థకు రూ.50 లక్షల జరిమానా విధిస్తే.. పనులు ఆశాజనకంగా ఉంటాయా అన్నది ఆలోచించాల్సిన విషయం. ఇదొక్కటే కాదు.. మిగిలిన 197 సంస్థల విషయంలో కూడా భారీగా జరిమానాలను విధిస్తూ ఏపీఐఐసీ అధికారులు నోటీసులను పంపుతున్నారు.

340 పరిశ్రమలకు కూటమి ప్రభుత్వంలో మళ్లీ అవకాశం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 340 మందికి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములను కేటాయించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరికి ఇచ్చిన భూముల ధరలను అమాంతం పెంచేసింది. పరిశ్రమలను పెట్టలేదన్న కారణంతో వాటి భూకేటాయింపులను కూడా తర్వాత రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. 340 పరిశ్రమలకు కూడా మళ్లీ అవకాశాన్ని కల్పించింది. రద్దు చేసిన భూకేటాయింపులను పునరుద్ధరించింది. పెంచిన భూముల ధరలను కూడా తగ్గించి రూ.16.50 లక్షలుగా నిర్ణయించింది. ఇంకా పరిశ్రమలు ఏర్పాటు చేయని వాటి విషయంలోనే వారికి ప్రోత్సాహకరంగా

మిగతా 6లో..

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మైలవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. మైలవరం ఎస్సై కె.సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని సీతారాంపురం తండాకు చెందిన భూక్యా సక్రు(55) వడ్డీకి నగదు తెచ్చి మిర్చి పంట సాగు చేశాడు. గత రెండేళ్లుగా నష్టాలు వచ్చాయి. అప్పు తీర్చకపోవడంతో వడ్డీ వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో భార్య లక్ష్మికి బయటకు వెళ్లి వస్తానని చెప్పిన సక్రు, గ్రామ శివారులోని బెండ తోటలో మద్యం సీసాలో పురుగు మందు కలుపుకుని తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6

పేర్ని నాని రెడ్‌లైన్ దాటేశారు!

- బందరు అభివృద్ధి చూసి ఓర్వ లేకే వ్యక్తిగత విమర్శలు
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి రవీంద్ర

ముగిసిన మహిళల ఖోఖో శిక్షణ

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే బోడె

అంబరాన్నంటిన సంబరాలు దీపావళి

నగరంలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. అశ్వయుజ అమావాస్యను హైందవ సంప్రదాయంతో ప్రజలు శ్రద్ధాభక్తులతో చేశారు. సోమవారం ఉదయం నుంచే నగరంలో పండుగ వాతావరణం కనిపించింది. గృహాలను అందంగా అలంకరించుకుని ప్రజలు భక్తితో లక్ష్మీదేవిని కొలిచారు. పండుగను పురస్కరించుకుని పలువురు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు.



విజయవాడ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉదయం పూజాది కార్యక్రమాల్లో నిమగ్నమైన ప్రజలు.. సాయంత్రం టపాకులతో సందడి చేశారు. ఆరుగంటల నుంచి నగరంలో బాణాసంచా మోత మోగింది. పండుగకు ముందు శని, ఆదివారాల్లో ఉపరితల ఆవర్తన ప్రభావంతో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. పండుగ రోజున వర్షం కురుస్తుందని అందరూ భావించారు. యువత, చిన్నారులకు కంగారుపడ్డారు. అయితే ఈ ఏడాది వర్షం రెండు రోజులు ముందే కురిసి పండుగ రోజున విరామం ఇచ్చింది. ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకునేందుకు వరుణుడు కూడా సహకరించాడు. పూర్తిగా పొడి వాతావరణంలో నగరంలో ప్రధాన రహదారులన్నీ పటాకుల మోతతో మారుమ్రోగాయి. అంతర్గత రహదారులన్నీ కాంతులతో నిండిపోయాయి. మతాబులు, సిసింద్రీలు, చిచ్చుబుడ్డీలు, భూ చక్రాలు, అగ్గిపెట్టెలు, పాము బిల్లలతో చిన్నారులు సరదాను ప్రదర్శించగా, లక్ష్మీ అవుట్‌లు, 500, 1000, 2000, 5000 వాలా, క్రాకర్స్‌తో యువత హల్‌చల్ చేసింది. 60, 120 షార్ట్స్ నింగిలోకి ఎగిరి ఆకాశానికి రంగులద్దాయి.






హరిత వేడుకల్లో కలెక్టర్ కుటుంబం

కలెక్టర్ ఇంట హరిత దీపావళి..

కలెక్టరేట్ : సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో హరిత దీపావళితో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కలెక్టర్ లక్ష్మీశ, కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు దీప కాంతుల వెలుగులో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి స్వచ్ఛమైన గాలి అత్యంత అవసరమని, వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందని, అధికారులు కూడా పర్యావరణానికి హాని కలిగించే టపాసులకు దూరంగా వుండాలని, తాను కూడా హరిత దీపావళిని జరుపుకుంటానని ఇటీవల క్లీన్ ఎయిర్ ఇతివృత్తంతో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులతో కలిసి సోమవారం హరిత దీపావళిని జరుపుకొని ఆదర్శంగా నిలిచారు.





వెలుగుల కీలాద్రి

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం చుట్టూ, ఉపాలయాల వద్ద దీపాలను వెలిగించారు. ప్రధాన ఆలయం వెలుపల అష్టలక్ష్మిల విగ్రహాల వద్ద దివ్యజ్యోతులు కాంతిని విస్తరింపచేశాయి. పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లు కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం దీపాలను వెలిగించి ఆనందోత్సాహల మధ్య బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో స్థానాచార్యుడు శివప్రసాదశర్మ పలువురు సిబ్బంది పాల్గొన్నారు. రాజగోపురానికి ప్రత్యేక విద్యుత్ దీపాలు అలంకరించారు. దీపావళి సందర్భంగా సోమవారం సాయంత్రం 7 గంటల తరువాత ఆలయాన్ని మూసివేశారు. మంగళవారం వేకువజాము నుంచి యథావిధిగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు. అభిషేకాదులు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి.



దీపావళి సంబరాల్లో కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే బుద్దప్రసాద్









ఇంద్రకీలాద్రిపై..



ఏపీ ఖోఖో మహిళల జట్టుతో టిఎస్ఆర్‌కె ప్రసాద్

ముగిసిన మహిళల ఖోఖో శిక్షణ

గన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం ఆధ్వర్యంలో గత వారంరోజులుగా గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో జరుగుతున్న ఏపీ మహిళల జట్టు మంగళవారం శిక్షణ పూర్తిచేసుకుంది. జట్టుకు టి.శ్రీనివాసరావు, షేక్ మీరా సాహెబ్ శిక్షణ ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రం దార్వాడ్‌లో ఈనెల 24 నుంచి 26 వరకు జరిగే సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టు పయనమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షుడు డీఎస్కార్కే ప్రసాద్ మాట్లాడుతూ, జట్టు విజయంతో తిరిగి రావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్ పాల్గొన్నారు. మహిళా జట్టు.. కె.కుమారి (కృష్ణా) కెప్టెన్, కె.ఓద్య (కృష్ణా), పి.చక్ర అనూష (తూర్పుగోదావరి), జి.పావని (తూర్పు గోదావరి), బి.శిరీష (విశాఖ), పి. హేమ (విశాఖ), జె.శ్రావణి (విజయనగరం) ఎస్..పావని (ప్రకాశం), యు.నాగ మల్లేశ్వరి (ప్రకాశం), యు.శశికళ (ప్రకాశం), ఎం.సఖియ (ప్రకాశం), ఆర్.యశోద (ప్రకాశం), బి. గుణవతి (శ్రీకాకుళం), పి.అమృత (శ్రీకాకుళం), కె.కీర్తన (చిత్తూరు) ఉన్నారు. జట్టు కోచ్ గా టి.శ్రీనివాసరావు (కృష్ణా) మేనేజర్‌గా లత (శ్రీకాకుళం) వ్యవహరిస్తున్నారు.



దివంగత టీడీపీ నేత సుదిమళ్ల రవీంద్ర కుమార్తెకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

» ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న టీడీపీ కుటుంబసభ్యులకు అన్నివేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర కుమార్తె అమృత సాహిత్య రెండో సెమిస్టర్‌కు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. సాహిత్య చదువు బాధ్యత పార్టీ చూసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, జగన్నాథపురం టీడీపీ అధ్యక్షులు సత్యనారాయణ, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై దృష్టిపెట్టండి : జేసీ ఇలక్కియా



కలెక్టరేట్ : విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన రైల్వే, జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో జేసీ సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్థితిగతులపై సమీక్షించారు. భూసేకరణలో పురోగతిపై చర్చించారు. ఆర్ఓబీ, ఆర్‌యూబీ వంటి రైల్వే ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారుల గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్, అవుటర్ రింగ్‌రోడ్డు తదితరాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, కలెక్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా మంజూరైన ప్రాజెక్టులను వేగవంతంచేయాలని, క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య వుంటే వెంటనే తమ దృష్టికి తేవాలని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో క్రియాశీలంగా వ్యవహరించాలని జేసీ స్పష్టం చేశారు.

పేర్ని నాని రెడ్‌లైన్ దాటేశారు!

» బందరు అభివృద్ధి చూసి ఓర్వలేకే వ్యక్తిగత విమర్శలు : మంత్రి రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'పేర్ని నాని.. రెడ్‌లైన్ దాటేశావు.. ఇక వదిలిపెట్టేది లేదు.. బందరు అభివృద్ధి చూసి ఓర్వలేకే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నావు.. ఆర్యవైశ్యులను వేధించి ఇప్పుడు లేనిపోని ప్రేమను చూపించడం సిగ్గుచేటు..' అంటూ ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్ని నాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను, వ్యాపారులను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తాను తప్ప మరెవరూ అధికారంలో ఉండకూడదని వ్యవహరిస్తున్నారన్నారు. మచిలీపట్నం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పెదసింగు లక్ష్మణరావును రాజకీయ సమాధి చేసేందుకు అతని కుమారుడికి కౌన్సిలర్‌గా టికెట్ ఇప్పించి ఓడించారన్నారు. 1999లో నడకుదిటి నరసింహారావు మంత్రిగా ఉన్నప్పుడు అనేక రకాలుగా వేధించారన్నారు. తనను హత్యకేసులో ఇరికించి రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నించారన్నారు. తన తండ్రి, తాత 1950లో కొన్న వ్యవసాయ భూములను అసైన్డ్ భూములని ప్రచారం చేసి కొట్టేయాలని ప్రయత్నించారన్నారు. రైసుమిల్లుల ద్వారా వేలాదిమందికి ఉపాధి కల్పించిన ఘనత తమ కుటుంబానిదేనన్నారు. వైశ్యసోదరుడు జల్లూరి గోపీ, అతని తమ్ముడు శ్రీధర్ అందరినీ పేర్ని నాని ఎంత వేధించారో అందరికీ తెలుసన్నారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలేగానీ ప్రేలాపనలతో ప్రజల మధ్య విబేధాలు సృష్టిస్తే చెప్పులతో కొడతారన్నారు. ఎలాంటి వ్యాపారాలు లేని పేర్నినానికి కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయన్నారు. ముడా భూములను తవ్వేసి మట్టిని గిడ్డంగులకు తరలించింది వాస్తవం కాదా అన్నారు. రంగనాయక స్వామి ఆలయ భూములను పేర్ని నాని కొట్టేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కూటమి నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, బత్తిన దాసు, లంకే శేషగిరి, లంకే నారాయణ ప్రసాద్, మాదివాడ రాము, పుప్పాల ప్రసాద్, అనిత, మరకాని సమతాకీర్తి, పీవీ ఫణికుమార్, తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లను మీడియాకు చూపించారు.

అరాచకాల కొండ!

(5వ పేజీ తరువాయి)

మధ్యస్థాయి ఉద్యోగులంతా ఈ నిబంధనను అనుసరిస్తున్నారు. దీనికి తాను మినహాయింపు అన్న భావనలో కొండపల్లి శ్రీనివాసరావు వ్యవహరించాడు. విదేశాలకు వెళ్లేటప్పుడు సంబంధిత సర్కిల్‌లోని సీటీవోకు ఎలాంటి సమాచారం ఇచ్చేవాడు కాదు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకునేవాడు కాదు. దర్జాగా పక్క ఊరికి వెళ్లి వచ్చినట్టుగా ప్రయాణం చేసేవాడు. శ్రీనివాసరావు అనధికారికంగా విదేశాలకు వెళ్తున్నాడని సర్కిల్‌లోని అధికారులకు పూర్తిగా సమాచారం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకునేవారు కాదు. పైగా అతనిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు.

రేపటి విధులకు ముందురోజే సంతకాలు

గవర్నరుపేట సర్కిల్‌లో కొండపల్లి శ్రీనివాసరావు ఎంత అరాచకంగా వ్యవహరించాడు, అతనికి అధికారులు ఏ స్థాయిలో వత్తాసు పలికారు అన్న దానికి బలమైన ఆధారాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రైవేటు ఉద్యోగులైనా ఏ రోజు విధులకు హాజరైతే ఆ రోజే హాజరుపట్టీలో సంతకాలు చేస్తారు. ఒకవేళ బయోమెట్రిక్ ఉంటే ఆరోజే వేస్తారు. ఈ విషయంలో కొండపల్లి శ్రీనివాసరావు తనంతట తాను సొంత నిబంధనను రూపొందించుకున్నాడు. శ్రీనివాసరావు తొమ్మిదో తేదీన లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత అధికారులు కార్యాలయంలో హాజరుపట్టికను పరిశీలించారు. తొమ్మిదో తేదీన హాజరుపట్టీలో సంతకం చేయడంతోపాటు ఆ మర్నాడు పదో తేదీన సంతకాలు చేసి ఉండడాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. వాణిజ్య పన్నుల శాఖలో బయోమెట్రిక్ హాజరు అమలవుతోంది. ఒకవేళ సాంకేతికంగా ఏమైనా సమస్యలు వస్తే ఇబ్బంది లేకుండా దానికి సమాంతరంగా హాజరుపట్టీని నిర్వహిస్తున్నారు. ఇందులో మాత్రం శ్రీనివాసరావు తర్వాత తేదీలో సంతకాలు చేయడం గమనార్హం. ఈ సర్కిల్‌లో ఉన్న అధికారి ఎవరైనా ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరైతే ఆ పేరు ఎదురుగా ఇన్‌టు మార్క్ పెడతారు. ఈ మార్క్ నుంచి కొండపల్లి శ్రీనివాసరావుకు మినహాయింపు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి.

అతడు ఎన్ని గంటల ఆలస్యంగా విధులకు వచ్చినా, అసలు సమాచారం లేకుండా విధులకు రాకపోయినా ఆ అధికారి వెనుకేసుకుని వచ్చినట్టు విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా కొండపల్లి అవినీతి కోటలను విస్తరించుకున్నాడని తెలుస్తోంది.

వాయుగండం!

(5వ పేజీ తరువాయి)

సమయంలో ఎంతనీరు దిగువకు పోతోందో, సముద్రపు పోటు సమయంలో అంతకంటే నీరు అధికంగా పొలాల్లో వస్తోంది. కోడూరు మండలంలోని హంసలదీవి, పాలకాయతిప్ప తదితర గ్రామాల్లో ఇప్పటివరకు చాలామటుకు పొలాల్లో నాట్లు వేయలేదు. నాట్లు వేసిన కొద్దిపాటి విస్తీర్ణంలోని పొలాల్లోకి సముద్రపు పోటు రావడంతో నీరు ఎగదన్ని పొలాల్లోని వరిపైరు మునిగిపోయింది. మచిలీపట్నం సౌత్ మండలంలోని మాలకాయలంక నుంచి కోన, పల్లెతుమ్మలపాలెం గ్రామాల వరకు ఆరు అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు ఉండగా, వీటి గేట్లు కొట్టుకుపోయాయి. దీంతో న్యూకోన డ్రెయిన్‌తోపాటు, దీనికి అనుబంధంగా ఉన్న డ్రెయిన్‌లలో వర్షపు నీరు ఎగదన్ని పొలాల్లో నీరు నిలబడి ఉంది. మరింతగా వర్షం కురిస్తే మచిలీపట్నం సౌత్ మండలంలోని వరి పొలాలు నీట మునుగుతాయని రైతులు అంటున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు కృత్తివెన్నులో అత్యధికంగా 10.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చల్లపల్లిలో 2.2 మిల్లీమీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 1.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా పలు ప్రాంతాల్లో ఒకమోస్తరు నుంచి భారీవర్షం కురిసింది.

ఆరోగ్య సమస్యలపై ఆందోళన వద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



చిన్నారిని పరామర్శిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పెనుగంచిప్రోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు భయపడాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ భరోసా ఇచ్చారు. రెండ్రోజుల క్రితం వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది సురక్షితంగా ఇంటికి చేరిన చిన్నారి చిట్టిమళ్ల గీతా సహస్రను మంగళవారం ఉదయం కలెక్టర్ పరామర్శించి ఆమె తల్లిదండ్రులను కలిసి ధైర్యం చెప్పారు. సహస్రకు వచ్చింది చిన్న ఆరోగ్య సమస్యఅని సోషల్ మీడియాలో కొంతమంది అవగాహనలోపంతో వ్యాధిగా ప్రచారం చేశారని తెలిపారు. అయినప్పటికీ జిల్లా యంత్రాంగాన్ని అక్కడికి పంపి మూడురోజులుగా వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సయుక్తంగా సేవలందిస్తున్నాయని గుర్తు చేశారు. గ్రామంలో శానిటేషన్ బాగానే ఉందని, అయినప్పటికి ఇంకా సమర్థవంతంగా నిర్వహించాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌లకు సూచించారు. మరో 24 గంటల పాటు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మరో డాక్టర్‌ను ఏర్పాటు చేస్తామని, ల్యాబ్ టెక్నీషియన్‌ను పంపిస్తామని కలెక్టర్ తెలియజేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీను, డిప్యూటీ ఎంపీడీవో కేవీ సుబ్బారావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, పంచాయతీ రాజ్ ఏఈపీ సుందర్‌రామయ్య, ఎంఈఓడి రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ అమ్మవారిని మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్‌కు స్వామివారి శేష వస్త్రాన్ని ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.



దుర్గమ్మ అలంకరణకు సిద్ధం చేస్తున్న గాజులు

గాజుల మహోత్సవానికి ఏర్పాట్లు

» పనులు ప్రారంభించిన ఈవో, చైర్మన్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నెల 23న నిర్వహించనున్న గాజుల అలంకరణ మహోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనాయక్ మహామండపం ఆరో అంతస్తులో మంగళవారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అలంకరణ కోసం పెద్దసంఖ్యలో గాజులను భక్తులు విరాళంగా సమర్పించారు. అమ్మవారికి రంగురంగుల గాజులను అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించనున్నారు. ప్రతీ ఏడాది గాజుల అలంకరణ ఆనవాయితీగా వస్తోంది. కార్తీక శుద్ధ విదియ (యమ ద్వితీయ) నాడు అమ్మవారిని ప్రత్యేకంగా గాజులతో అలంకరిస్తారు. భక్తులు అమ్మవారి ప్రత్యేక అలంకరణ దర్శనాన్ని చేసుకోవాలని కోరారు.

జరిమానాల మోత!

(5వ పేజీ తరువాయి)

ఉంటున్నపుడు.. వైసీపీ హయాంలో బాధితులుగా ఉండి వివిధ దశలలో పనులు చేపట్టిన వాటి విషయంలో గడువులు పెంచితే తప్పేమిటో అధికారులే చెప్పాలి. భూములు తీసుకుని అసలు పరిశ్రమలే పెట్టని వాటికి వెసులుబాటు కల్పించినపుడు పరిశ్రమలను ఇప్పటికే ప్రారంభించి కొనసాగిస్తున్న వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తమ లోపాలను పక్కనపెట్టి మరీ..

పనులు చేపడుతున్న పారిశ్రామిక సంస్థలపై జరిమానాలు విధిస్తున్న ఏపీఐఐసీ అధికారులు తమ వైపు ఉన్న లోపాలను కూడా ఆలోచించాల్సి ఉంది. ఇప్పటి వరకు మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌కు నీటి సదుపాయాన్ని కల్పించలేకపోయారు. అలాగే పూర్తి స్థాయిలో విద్యుత్ సదుపాయాలను కూడా కల్పించలేదు అగ్రిమెంట్ సందర్భంలో ఏపీఐఐసీ అధికారులు 11 కేవీ, ఎల్‌టీ లైన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 80 శాతం పనులే జరిగాయి. ఇంకా 20 శాతం పనులు బ్యాలెన్స్ ఉన్నాయి. తమ వైపున ఉన్న తప్పులను పక్కన పెట్టి నిర్ణీత సమయం కంటే ఆలస్యమయ్యాయని వారిపై జరిమానాలు విధించటం కూడా సముచితం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పరిశ్రమలు తీసుకొచ్చే వేళ ఇలాంటివి తగదు!

గత ప్రభుత్వంలో నానా బాధలు పడినా.. పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తే.. ఆయా సంస్థల నుంచి బ్యాడ్ ఫీడ్ బ్యాక్ బయటకు వస్తే చెడు సంకేతాలు వెళతాయి. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు విశేష కృషి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటివి ఏమాత్రం మంచిది కాదు. ఇప్పటికైనా ఏపీఐఐసీ అధికారులు తమ తీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసుల త్యాగాలు

(5వ పేజీ తరువాయి)

ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, పోలీస్ వ్యవస్థ లేకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేమన్నారు. శాంతి భద్రతలను కంటికి రెప్పలా కాపాడుతున్న పోలీసులను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ఇటీవల పోలీసుల పట్ల కొన్ని సందర్భాల్లో దురుసుగా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. పోలీసుల సంక్షేమం కోసం తాను రూ.లక్ష విరాళం అందిస్తున్నానని చెప్పారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులే కీలకమన్నారు. ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అమరవీరుల దినోత్సవం గురించి వివరించారు. అనంతరం అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి జిల్లా కోర్టు సెంటర్ వరకు జరిగిన శాంతి ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ బి. సత్యనారాయణ, టౌన్ డీఎస్పీ సిహెచ్. రాజా, చిలకలపూడి,ఆర్‌పేట సీఐలు నబి, ఏసుబాబు, ఆర్ఎస్ఐ కిరణ్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

కంకిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై స్థానిక పంచాయతీ అధికారులు దృష్టిపెట్టాలని కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడులోని వడ్డెర కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. వడ్డెర కాలనీలో అవసరమైన రహదారి, డ్రెయినేజీ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, పైపులైను సమస్య కూడా పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. శానటరి ఇన్‌స్పెక్టర్ రామారావు, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు రవి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వడ్డెర కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉప సర్పంచ్ చిరంజీవి

అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ. 50వేలు

పెనమలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆకలితీర్చే అన్న క్యాంటీన్ నిర్వహణకు సహాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. టీడీపీ అభి మాని పీతశ్రీరామదాసు మంగళవారం ఎమ్మెల్యేను పోరంకిలో ఆయన కార్యాలయంలో కలసి అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ. 50వేల చెక్కు అందజేశారు. ఈ సదర్భంగా దాత శ్రీరామదాసును ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి అభినందించారు.



దాత శ్రీరామదాసును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఘనంగా ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు జన్మదిన వేడుకలు

గన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) : ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తొలుత ఆయన తల్లి పొట్లూరి చంద్ర పుష్పవతితో కేకుకట్ చేయించారు. ఇంటి దగ్గర నుంచి భారీ ర్యాలీతో జ్యూవెల్ కౌంటిలోని హాలులో బసవరావు అభిమానులు, టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేశారు. నిస్వార్థ ప్రజాసేవకుడు బసవరావు అని పలువురు నేతలు పేర్కొన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుని ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు మూల్పూరి బాల కృష్ణారావు, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, పీఆర్‌కె ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ, సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీ మౌనిక, నిడమర్తి సౌజన్య, శేషుకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ, నల్లమోతు రమేష్, బొబ్బా వీర రాఘవరావు, మాదల శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి వెంకటరత్నం, తుమ్మల ఉదయ్, కేవీఆర్ కిషోర్, రాజులపాటి శ్రీనివాసరావు, శొంఠి కిషోర్, జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, మూల్పూరి శివరామకృష్ణయ్య, కేసరపల్లి ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు, కొండేటి ఏడుకొండలు, ఏలూరు సుధీర్, కంచర్ల ముత్యాలు, షేక్ అబుల్యాజ్, చిక్కవరపు నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న పొట్లూరి బసవరావు, మాజీ ఎమ్మెల్యేలు బాలవర్ధనరావు, బాలకృష్ణ



ఉయ్యూరులో పోలీసుల ప్రదర్శన.. కంకిపాడులో విద్యార్థుల మానవహారం

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ఉయ్యూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించి అనంతరం ప్రధాన సెంటర్ వరకు ప్రదర్శన చేసారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటామన్నారు రూరల్ ఎస్సై సురేశ్‌బాబు, పోలీస్ సిబ్బంది ప్రదర్శనలో పాల్గొన్నారు.

కంకిపాడు : శాంతి భద్రతల విషయంలో పోలీసులు చేపడుతున్న త్యాగాలు మరువలేనివని కంకిపాడు ఎస్సై తాతాచార్యులు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈడుపుగల్లులో మంగళవారం విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తాతాచార్యులు మాట్లాడుతూ, పోలీ సుల త్యాగాలకు ఈ పోలీసు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీ ఎస్ఐ పత్యం సురేష్, ఎఎస్సై అనీల్, సిబ్బంది, పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) : వేలేరులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలో పుట్టగుంట సతీష్ కుమార్ సోమవారం రాత్రి దీపావళి పండుగను విద్యార్థుల సమక్షంలో జరుపుకున్నారు. పాఠశాలలో ఉన్న 150 మంది విద్యార్థులకు టపాసులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నేత నందిగం స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● పేద వర్గాల్లో నిజమైన దీపావళి కనిపిస్తోందని నాగార్జున సాగర్ ఎడమ కాలువ పీసీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి దీపావళి సందర్భంగా రంగన్నగూడెంలో సంప్రదాయంగా గంగిరెద్దుల మేళం ప్రదర్శన నిర్వహించారు. ఆళ్ల గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి

కంకిపాడు: దీపావళి వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు సుఖ సంతోషాలతో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళల వారి ఇళ్లలో లక్ష్మీదేవి పూజలు నిర్వహించి, ఇంటి ఆవరణలో దీపాల కాంతులు మధ్య చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా ఆరు బయట టపాసులు కాలుస్తూ సరదాగా గడిపారు.



వేలేరు అనాథ బాలల పాఠశాలలో పుట్టగుంట.. కంకిపాడులో..



బాలికపై అత్యాచారయత్నం

ఉయ్యూరు : స్థానికంగా నివసించే 10 ఏళ్ల బాలికపై వరుసకు మేనమామ అయ్యే వ్యక్తి మంగళవారం అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. పోలీసుల వివరా ల ప్రకారం.. స్థానికంగా నివసించే వ్యక్తి తన ఇంటి సమీపంలో నివసించే బాలిక ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో లోపలికి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక భయపడి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారువచ్చి పట్టుకుని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కానుమోలులో గ్రామసభ

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుమోలులో మంగళవారం రీసర్వే పై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించారు. రీసర్వే డీటీ వి.రాజేందర్ ఆధ్వర్యంలో కానుమోలు, పెరికీడు. కె.సీతారాంపురం గ్రామాల్లోని 1,521 రైతులకు సంబంధించిన భూమిని మే నెలలో రీసర్వే నిర్వహించారు. రీసర్వేపై ప్రచురించిన నోటిఫికేషన్‌పై గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలు, సవరణలు స్వీకరించారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.







ఫ్యాషన్



ధగధగలాడే బంగారం డ్రెస్

బంగారంతో ఆభరణాలతో పాటు దుస్తులూ రూపొందుతూ ఉంటాయి. తాజాగా దుబాయ్‌కు చెందిన అల్ రొమోజాన్ ఆభరణాల బ్రాండ్... పది కిలోల బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల ఖరీదైన 'దుబాయ్ డ్రెస్'ను రూపొందించింది. ఇలాంటి బంగారం దుస్తుల స్ఫూర్తితో ట్రెండ్‌గా మారిపోతున్న గోల్డెన్ డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా...



9.5 కోట్ల డ్రెస్

విలాసాలకూ, సంపదకూ పేరు పొందిన దుబాయ్ తాజాగా 21 క్యారెట్ల మేలిమి బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల రూపాయల విలువైన బంగారం డ్రెస్‌ను రూపొందించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. పది కిలోల బరువున్న ఈ డ్రెస్ ప్రపంచంలోనే అత్యంత బరువైన, విలువైన డ్రెస్‌గా పేరు తెచ్చుకుంది. ఒక బంగారు కిరీటం, నెక్లెస్, నడుముకు తగిలించుకునే హియార్ అనే ఆభరణం లాంటి అదనపు హంగులు కూడా ఈ డ్రెస్‌కు తోడవడం విశేషం. ఎమిరాటి సంస్కృతిని ప్రతిబింబించేలా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చరిత్ర, వారసత్వాలకు అద్దం పడుతూ చక్కని పనితనంతో, ఆకృతులతో ఈ డ్రెస్‌ను ఎంతో కళాత్మకంగా రూపొందించారు.

బంగారం ప్రియులను అలరించేలా...

ఈ దుస్తులకు తగ్గట్టుగా రూపొందించిన బంగారం టియారా 398 గ్రాముల బరువుంటే, నెక్లెస్ ఏకంగా 8,810 గ్రాముల బరువుంది. ఇయర్ రింగ్స్ 134 గ్రాముల బరువున్నాయి. ఇలాంటి అత్యంత బరువైన, విలువైన బంగారం డ్రెస్ రూపకల్పన... ప్రపంచ నాయకత్వాన్ని చాటుకోవాలనే యుఎఇ ఆశయం ప్రతిబింబించడంతో పాటు దుబాయ్ నగరం... బంగారు ఆభరణాల ప్రియుల ప్రధాన గమ్య స్థానంగా ప్రత్యేక గుర్తింపును కూడా పొందగలిగింది. షార్జాలో జరిగిన 56వ మధ్యప్రాచ్య వాచ్ అండ్ జ్యువెలరీ ప్రదర్శనలో భాగంగా పలు ఆభరణాల కంపెనీలు తమ ఆసక్తికరమైన ఉత్పత్తు లను ప్రదర్శించాయి. 500మందికి పైగా స్థానిక, అంతర్జాతీయ ప్రదర్శనకారులు పాల్గొనగా, ప్రపంచవ్యాప్తంగా 1800 మంది డిజైనర్లు, వర్తకులు వారి ఉత్పత్తులు ప్రదర్శించారు. వీటిలో దుబాయ్ డ్రెస్‌తో పాటు మూడున్నర కోట్ల రూపాయల విలువైన గోల్డ్ ప్లేటెడ్ సైకిల్ కూడా ఉండడం చెప్పుకోదగిన విశేషం!



వినూత్నం

ప్రతి ఒక్కరిలో రహస్య నైపుణ్యాలు దాగి ఉంటాయి. వాటిని కనిపెట్టి మెరుగులు దిద్ది, ప్రతిభను చాటుకునే సామర్థ్యం కొందరికే ఉంటుంది. కేరళకు చెందిన బీట్ ఆఫీసర్, **బిస్మి విల్స్** కథే ఇందుకు ఉదాహరణ. అటవీ శాఖలో వృత్తి బాధ్యతలకే పరిమితమైపోకుండా, తనలోని కెమెరా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, కేరళ అటవీ శాఖ ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ ప్రయత్నాలకు నిదర్శనంగా మారిందామె. మరిన్ని వివరాలు...

అడవిలో ఫొటోగ్రాఫర్‌గా మారి..

తిరువనంతపురంలోని పరసాలకు చెందిన బిస్మి విల్స్. కేరళ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. పరీక్ష పాసై, ఉద్యోగానికి ఎంపికైంది కాబట్టి వృత్తిలో చేరాలనే ఆలోచనే తప్ప, వృత్తి పట్ల ఆమెకెలాంటి ఆసక్తి కలగలేదు. అయితే ఆమె పై అధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియ టి.జోసెఫ్ మాటలు బిస్మిని ప్రభావితం చేశాయి. వృత్తిలో పైకి ఎదగాలంటే, వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలనీ, మక్కువ పెంచుకోవాలనీ ప్రియ... బిస్మికి హితబోధ చేసింది. ఆ మాటలు బిస్మి మనసులో నాటుకుపోయాయి. అప్పటి నుంచి అడవిలో గస్తీ సమయంలో పరిసరాలను ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టింది.

చుట్టూరా అందమైన ప్రకృతి, ఆసక్తి కలిగించే వన్యప్రాణులు, వాటి ప్రవర్తనలు ఆమెను ఆకట్టుకోవడం మొదలుపెట్టాయి. వాటిని జ్ఞాపకాల్లో బంధించడంతో పాటు, అటవీ శాఖకు ఉపయోగపడేలా కెమెరాలో బంధిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే ఆలోచనతో ఒకడిఎస్ఎల్ఆర్ కెమెరా కొనుగోలు చేసింది బిస్మి. ఈ సందర్భం గురించి ప్రస్తావిస్తూ....'పంప ప్రాంతంలో విధులు నిర్వహించే సమయంలో అక్కడి చెట్ల ఆకులు నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఫీల్డ్ డ్యూటీలో భాగం వేర్వేరు చెట్లను గుర్తు పెట్టుకోవడం కోసం వాటి ఆకులను



సేకరించడం మొదలుపెట్టాను. ఆ తర్వాత నా ఆసక్తి సీతాకోకచిలుకల మీదకు మళ్లింది. వేర్వేరు జాతుల డేటాను సేకరించడం కోసం ఒక యాప్‌ను కూడా ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. అయితే చిన్న జాతుల మధ్య తేడాలను గుర్తించాలంటే వాటిని ఫొటోలు తీసుకోక తప్పదు. దాంతో నాది పాత ఫోన్ అవడంతో, ఒక డిజిటల్ కెమెరా కొనుక్కున్నాను" అంటూ తన కెమెరా ప్రయాణం తొలినాళ్ల గురించి వివరించింది బిస్మి.

నేర్పు, ఓర్పు అవసరం

పంప నుంచి వలక్కడువుకు బదిలీ అవడంతో బిస్మిలోని వన్యప్రాణుల ప్రేమికురాలు మేలుకొంది. "పంపకు భిన్నంగా వలక్కడువులో ఏనుగులు, సాంబార్ డీర్.. ఇతర జంతువులు కనిపిస్తూ ఉండేవి. ఫారెస్ట్ వాచర్, అనుభవమున్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ విష్ణు నాకు తోడయ్యాడు. దాంతో ఇద్దరం కలిసి వన్యప్రాణులను వెతుక్కుంటూ కొండల మీద తిరగడం మొదలుపెట్టాం. ఏనుగుల వాసనను పసిగట్టి, వాటికి 250 మీటర్ల దూరానికి చేరుకుని, అందమైన ఫొటోలు తీయడం మొదలుపెట్టాం. జంతువుల దృష్టిలో పడకుండా ఎలా నడుచుకోవాలో, వాటికి భంగం కలగకుండా ఫొటోలు ఎలా తీయాలో, గాలి వీచే దిశ ఆధారంగా, నా ఉనికిని జంతువులు పసిగట్టే వీలు లేకుండా ఫొటోలకు తగిన ప్రదేశాన్ని ఎలా ఎంచుకోవాలో అతను నాకు నేర్పించాడు.

ఆ మెలకువల మీద పట్టు పెరిగిన తర్వాత, ఎన్నో మరపురాని ఫొటోలను తీయగలిగాను. ఎలుగుబంటి మీద దాడి చేసే అడవి కుక్కను ఫొటోలో బంధించగలిగాను. మేత మేస్తూ, గొడవ పడుతూ, ప్రేమ ప్రదర్శించుకునే పాతిక ఏనుగుల మందను ఫొటోలు తీయగలిగాను. అయితే ఫొటోల కోసం నేను చేసే ప్రతి ప్రయత్నం ఫలిస్తుందనే నమ్మకం ఉండదు. గంపెడు ఆశతో వెళ్లి, నిరుత్సాహంతో వెనుతిరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. గంటల తరబడి ఎదురుచూసి, ఖాళీ చేతులతో తిరిగొచ్చిన రోజులూ లేకపోలేదు. వన్యప్రాణుల ఫొటోగ్రఫీకి ఎంతో నేర్పు, ఓర్పు అవసరం" అంటూ ఫొటోలు తీయడంలో ఎదుర్కొన్న శ్రమల గురించి వివరిస్తోంది బిస్మి.

పులిని ఫొటో తీయాలి

"నా అంతిమ లక్ష్యం పులిని ఫొటోలు తీయడం. చాలాసార్లు వాటిని అనుసరించినా, కెమెరాలో బంధించే అవకాశం ఇప్పటివరకూ రాలేదు. పులులు సిగ్గరులు. అవి మనుషులకు దూరంగా ఉంటాయి. అయినా ఏదో ఒకనాటికి పులిని కచ్చితంగా కెమెరాలో బంధిస్తాను' అంటున్న బిస్మి, ప్రకృతి, వన్యప్రాణుల పట్ల ప్రేమతో అటవీ శాఖలో చేరుతున్న మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందనీ, అయితే ఈ వృత్తిలోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల పట్ల మక్కువను పెంచుకోవడం అవసరమని అంటోంది. ఆమె తీసిన ఫొటోలు కేరళ అటవీ శాఖ డాటా సేకరణకు ఎంతో బాగా ఉపయోగపడుతున్నాయి. బిస్మి ఫొటోల వల్ల, అడవిలో వన్యప్రాణుల జీవనశైలి, వాటి మధ్య వైవిధ్యాలను ఆధారాలతో సహా ప్రదర్శించగలిగే అవకాశం కూడా దక్కుతూ ఉండడం చెప్పుకోదగిన విశేషం .



ఈ మహిళా కారాగారం... బతుకుల్ని మార్చే ఆశ్రమం

వివిధ కారణాలతో ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారి జీవితాల్లో మార్పు కోసం, సాధికారత కోసం కృషి చేస్తోంది రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం.

ఈ సెమీ ఓపెన్ ప్రిజన్‌లో, ఆశ్రమంలాంటి వాతావరణంలో మహిళా ఖైదీలు... పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.

కూరగాయల పెంపకం, పిండి వంటల తయారీ... ఇలా ఎన్నో మార్గాలతో జైలుకు ఆదాయాన్ని సమకూరుస్తూ, వేతనాలు సంపాదిస్తున్నారు.

జైలు నుంచి విడుదలయ్యాక సొంతకాళ్ల మీద నిలబడి, స్వయంసమృద్ధి సాధించడానికి పునాదులు వేసుకుంటున్నారు.



కృషితో నాస్తి దుర్భిక్షం... ఇది పెద్దలు చెప్పిన మంచి మాట. కృషితో మంచి మార్పు కూడా సాధ్యమేనని రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం అధికారులు రుజువు చేస్తున్నారు. మహిళా ఖైదీలకు చదువుతోపాటు పంటల సాగు, వంటల తయారీలో నైపుణ్యాలను అందించి, జైలు నుంచి వారు విడుదలయ్యాక... సొంత కాళ్ల మీద నిలబడేందుకు ఊతం ఇస్తున్నారు. దేశంలోని కొన్ని మహిళా కారాగారాల్లో ఓపెన్ ప్రిజన్ విధానం ప్రారంభమైనా, రకరకాల సమస్యలతో కొంత కాలానికే మూతపడ్డాయి. కానీ ఇక్కడ ఏడాదిన్నర నుంచి విజయవంతంగా అమలవుతోంది. ఆ జైలులోని మహిళా ఖైదీలు ఎన్నో రకాల పంటలు పండిస్తూ జైలుకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు వేతనాల రూపంలో తామూ సంపాదించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప, రాజమహేంద్రవరంలో మాత్రమే ప్రత్యేక మహిళా కారాగారాలు ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని కారాగారాన్ని ఆశ్రమం మాదిరిగా తీర్చిదిద్దారు. మహిళా ఖైదీల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసం, శిక్ష పూర్తయ్యాక తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకొని జీవనోపాధి పొందడం కోసం వారికి ఆసక్తి ఉన్న పనిలో తర్ఫీదు ఇస్తున్నారు. వారి నైపుణ్యాలను పదునుపెడుతున్నారు.

పూర్తి సేంద్రియంగా...

ఈ కారాగారంలో సెమీ ఓపెన్ ప్రిజన్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. సాధారణంగా శిక్షపడిన, రిమాండ్ ఖైదీలను జైలు లోపల ఉంచుతారు. వాళ్లలో సత్ప్రవర్తనతో మెలిగే జీవిత ఖైదీలను జైలు ప్రాంగణంలో వివిధ అవసరాలకు వినియోగిస్తారు. ఇక్కడి ఓపెన్ ప్రిజన్ కోసం 27 మంది ఖైదీలను ఎంపిక చేశారు. వారిలో కొందరు విడుదల కాగా... ప్రస్తుతం 15 మంది ఉన్నారు. వీళ్లను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ఈ జైలుకు చెందిన అయిదు ఎకరాల భూమి పూర్వం చిట్టడవి మాదిరిగా ఉండేది. దాన్ని సాగుకు అనువుగా మలిచారు. సుమారు రూ.1.50 లక్షలతో డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ భూమిలో అంజూర, షర్బత్ నిమ్మ, ఉసిరి, సీతాఫలం, వాటర్ యాపిల్, నారింజ, బత్తాయి, మామిడి, పనస, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, జామ తదితర పండ్ల మొక్కలను నాటారు. వంకాయ, బెండ, దోస, ఆనప, కాకర, గోరు చిక్కుడు, పందిరి చిక్కుడు, బీర, టమాట, దొండ లాంటి కూరగాయలతో పాటు ఆకు కూరలను జైలు సిబ్బంది పర్యవేక్షణలో మహిళా ఖైదీలు సాగు చేస్తున్నారు. వీరికి గతంలో ఎలాంటి వ్యవసాయ అనుభవం లేదు. ఉద్యానవన, అటవీ, వ్యవసాయ తదితర శాఖల సలహాలను పాటిస్తూ పూర్తి ప్రకృతి, సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. ట్రాక్టరు లాంటి యంత్రాలు లేకుండా సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ... రోజుకు రూ.1500 వరకూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.



త్వరలో క్యాటరింగ్ సేవలు...

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారంలో కవర్ల తయారీ యూనిట్, బేకరీ యూనిట్, టైలరింగ్ యూనిట్ ఉన్నాయి. వీటిలో తయారు చేసే పదార్థాలు, వస్త్రాలు, వస్తువులను జైలు బయట విక్రయిస్తారు. అలాగే రాగి మాల్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి జైలు బయట చేసే ఆకు కూరలు, కాయగూరల విక్రయాలు అరగంటలో పూర్తయిపోతాయి. బేకరీ యూనిట్‌లో నాణ్యమైన దినుసులు ఉపయోగించి... స్వీట్లు చాక్లెట్లు, ఉస్మానియా బిస్కట్లు, ఫ్రూట్‌కేక్, బ్రెడ్, వాము పకోడి, కారప్పూస, జంతికలు, అటుకుల మిక్చర్, కార్న్ ఫ్లాక్స్ బూందీ, బెల్లం గవ్వలు లాంటివి తయారు చేసి బహిరంగ మార్కెట్ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. ఇవి నిల్వ ఉండడానికి, రుచి పెంచడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. పిండి వంటలు, బేకరీ ఐటమ్స్, టైలరింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రోజుకు రూ.5వేల వరకూ జైలుకు ఆదాయం సమకూరుతోంది. "ఇప్పటికే ఆర్డర్లపై పిండి వంటలు తయారుచేసి ఇస్తున్నాం. త్వరలో క్యాటరింగ్ సేవలు, స్వీట్ స్టాల్ కూడా ప్రారంభిస్తాం. ఈ ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత బతుకుతెరువుకు ఇబ్బంది పడకుండా సమాజంలో గౌరవంగా జీవించాలనేదే మా ధ్యేయం. దీని వెనుక మా డీజీ, ఐజీ, డీఐజీల ప్రోత్సాహం చాలా ఉంది. మహిళా ఖైదీలతో వ్యవసాయం దిశగా అడుగులు వేయడంలో డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఎంతో సహకరించారు. మా సిబ్బంది సహాయంతో మహిళా ఖైదీల జీవితాల్లో మెరుగైన మార్పులు రావడానికి కృషి చేస్తున్నాం" అంటున్నారు జైలు సూపరింటెండెంట్ వసంతకుమారి.



తారతమ్యాలు లేకుండా...

రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో తారతమ్యాలకు తావు ఉండదు. ఏ పండుగ వచ్చినా అందరూ కలసిమెలసి చేసుకుంటారు. జైలు అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములవుతారు. ఎవరి ప్రార్థనాలయాలు వారికి ఉన్నాయి. రోజూ ఉదయం యోగాతో ఖైదీలు తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. తర్వాత కాసేపు ఇష్ట దైవారాధన చేసి, దైనందిన పనుల్లో నిమగ్నమవుతారు. వంటశాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుతారు. జైలు ఆవరణలో ఎటు చూసినా పచ్చదనం, అందమైన రంగవల్లులు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంగణంలో ఆరు పడకల ఆసుపత్రి ఉంది. వైద్యులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటారు. డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు చదివే సౌలభ్యం ఉంది. అధికారుల ప్రోత్సాహంతో 2008 నుంచీ ఇప్పటి వరకూ 32 మంది డిగ్రీ, ఇద్దరు పీజీ పూర్తి చేశారు. 2021-2024లో డిగ్రీ పూర్తి చేసిన డి.నాగరాజకుమారి బంగారు పతకం సాధించారు. ఈ కారాగారంలో అయిదు వేల పుస్తకాల గ్రంథాలయం కూడా ఉంది.

• పి.రమేశ్ నాగేంద్ర

వంటింటి వ్యర్థాలే బలం..!

మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు అత్యవసరం. రసాయన ఎరువులకు బదులు వంటింటి వ్యర్థాలను ఉపయోగిస్తే మొక్కలు మరింత ఆరోగ్యంగా ఉంటాయి. వంటింటి వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా ఎలా వాడాలో తెలుసుకుందాం...

- కోడిగుడ్డు పెంకుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది మొక్క పెరుగుదలకు తోడ్పడడమే కాకుండా పూలు, కాయలు అధికంగా ఉత్పత్తి కావడానికి దోహదం చేస్తుంది. కోడిగుడ్డు పెంకులను మెత్తగా పొడి చేయాలి. మొక్కల మొదళ్లలో కొద్దిగా



తవ్వి, వేర్ల చుట్టూ ఈ పొడిని చల్లాలి. తరువాత యథావిధిగా మట్టిని పరచి కొన్ని నీళ్లు చిలకరించాలి. గుడ్డు పెంకుల పొడిని నీళ్లలో కలిపి రోజూ మొక్కల మొదళ్లలో పోసినా ప్రయోజనం కనిపిస్తుంది.
- అరటి పండు తొక్కలో అధికంగా ఉండే పొటాషియం, భాస్వరం లాంటి మూలకాలు.. పూల ఉత్పత్తిని పెంచుతాయి. అరటి తొక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేయాలి.



నిండా నీళ్లు పోసి మూతపెట్టి మూడు రోజులు అలాగే ఉంచాలి. తరువాత ఈ నీటిని మొక్కల మొదళ్లలో పోస్తే పువ్వులు గుత్తులు గుత్తులుగా వస్తాయి.
- ఆకు కూరల కాడలు, కూరగాయల వ్యర్థాలు.. సహజ ఎరువులుగా పనిచేస్తాయి. వీటిని మట్టిలో కలిపి మొక్కల మొదళ్లలో చల్లవచ్చు. లేదంటే మొక్కల మొదళ్లలో, చుట్టూరా కొద్దిగా తవ్వి వీటిని వేసి పైన మట్టితో కప్పవచ్చు.



- వాడేసిన టీ పొడిలో కొన్ని నీళ్లు పోసి వడకట్టాలి. ఈ పొడిని గట్టిగా పిండి కాగితం మీద వేసి బాగా ఆరబెట్టాలి. తరువాత ఈ పొడిని వారానికి ఒకసారి కొద్దికొద్దిగా తీసుకుంటూ మొక్కల మొదళ్లలో చల్లాలి. ఇలా చేయడం వల్ల పచ్చని ఆకులతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

పిల్లల విషయంలో జాగ్రత్త..!

నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలపై రకరకాల ఆశలు పెట్టుకుంటున్నారు. వాటిని సాధించి తీరాలంటూ పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీని వల్ల పిల్లల మానసిక స్థితి ప్రభావితమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



- పిల్లలందరి శక్తి సామర్థ్యాలు, ఆలోచన తీరు ఒకేరకంగా ఉండవు. కాబట్టి పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. అవసరమైన శిక్షణ ఇప్పించాలి.
- క్రమశిక్షణ పేరుతో పిల్లలకు కఠినమైన ఆంక్షలు పెట్టకూడదు. కేవలం చదువుకు మాత్రమే ప్రాముఖ్యమిస్తే పిల్లలు ఆటపాటల్లో రాణించలేరు. అంతేకాదు వాళ్లకు.. ఇతరులతో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, పోటీ తత్వం అలవడవు.
- పిల్లలు ఏవైనా పొరబాట్లు చేస్తే వారిపై కోపం చూపించకూడదు. సామరస్యంగా వ్యవహరించి మంచి, చెడుల తారతమ్యాన్ని వివరించాలి.
- పరీక్షల్లో మార్కులు తగ్గాయనో, ఆటల్లో ఓడిపోయారనో పిల్లలను 'నీకేమీ చేతకాదు' అంటూ నిరాశ పరచకూడదు. దీనివల్ల పిల్లల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. మరో ప్రయత్నం చేసి అనుకున్నది సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- పిల్లల ఇష్టాలు, ఆశయాలు తెలుసుకోకుండా చెప్పిన మాట వినాలంటూ ఒత్తిడి చేయకూడదు. పిల్లలు ఏవిధంగా ఆలోచిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. పిల్లల అభిరుచులను గమనిస్తూ ఉండాలి. సమయం దొరికినప్పుడల్లా పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి.
- పిల్లల మీద అతిగా ప్రేమ చూపిస్తూ వాళ్లు ఏమి చేసినా సమర్థించడం కూడా మంచిది కాదు. పిల్లలకు సమయపాలన, తోటివారితో స్నేహంగా ఉండడం, పెద్దలతో మర్యాదగా మెలగడం, సమయస్ఫూర్తి నేర్పించాలి. పోషకాహారం, వ్యాయామం, వ్యక్తిగత శుభ్రతల గురించి తెలియజెప్పాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

కొండాలమ్మ హుండీ లెక్కింపు 24న

గుడ్లవల్లేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 24 శుక్రవారం హుండీలు లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే మోహన్, ధర్మకర్తలు, దేవాదాయ శాఖ అధికారుల, పోలీసులు, బ్యాంక్ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి కలవారు పాల్గొనాలని కోరారు.



అండర్-14 బాలుర కబడ్డీ జట్టు

అండర్-14,17 కబడ్డీ జట్ల ఎంపిక

గుడివాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం గుడివాడ డివిజన్‌లోని 12మండలాల స్కూల్ గేమ్స్ సెలక్షన్ పోటీలను నిర్వహించారు. కబడ్డీ అంశంలో అండర్-14,17 కేటగిరిల్లో బాలుర, బాలికలకు పోటీలను నిర్వహించి అంతర్జాతీయ రిఫరీ ఏసురత్నం ఆధ్వర్యంలో డివిజన్ జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ డివిజన్ ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్, ఏజీకే ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు టి.నరేంద్రబాబు, డి.చంద్రశేఖర్, డివిజన్‌లోని వివిధ మండలాల వ్యాయామోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

పమిడిముక్కల : ఈ క్రాప్ నమోదు ఈనెల 25తో ముగియనున్న నేపథ్యంలో రైతులందరు పంటను చివరితేదీలోపు తప్పని సరిగా నమోదుచేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు తమ పంట వివరాలు నమోదు చేసుకోని రైతులు వెంటనే సమీపంలోని రైతు సేవాకేంద్రంలో సంప్రదించి పంటలు నమోదు చేసుకోవాలని నిర్ణీత గడువు తరువాత నమోదు అవకాశం ఉండదు. రైతుల పంటలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి



తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు, అక్టోబరు 21 : (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో సోమవారం దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చీకట్లు తొలగి వెలుగులు ఇచ్చే పండుగగా దీపావళిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రమిదల్లో నూనెపోసి దీపాలు వెలిగించారు. సాయంత్రం పిల్లాపాపలతో టపాసులు కాల్చి పరవశించారు.

గుడివాడ రూరల్ : గుడివాడ మండలంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దీపావళి పండుగను రూరల్ మండలంలో సోమవారం ఉదయం తలస్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రంపూట మందుగుండు సామగ్రి, దీపాలు వెలిగించి సందడి చేసుకున్నారు.



కూచిపూడిలో నరకాసుర దహనం చేసిన గ్రామస్థులు

కూచిపూడి : దీపావళి పండుగ రోజైన సోమవారం రాత్రి వాతావరణం ప్రశాంతంగా ఉండటంతో యువకులు ఉత్సాహభరితంగా నిర్వహించనున్నారు. పండుగ రోజు సాయంత్రం నుంచి ఢాం- ఢాం మోతలతో గ్రామాలు దద్దరిల్లాయి. దీనిలో భాగంగానే కూచిపూడిలో అగ్రహారం యువకుల ఆధ్వర్యంలో దీపావళి మందుగుండు సామగ్రితో రూపొందించిన నరకాసురుని దహన కార్యక్రమం అత్యంత వేడుకలతో నిర్వహించారు. కూచిపూడిలోని గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళలు, పురుషులు, యువకులు అందరూ పాల్గొని ఆనంద వాతావరణంలో కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం దీపాల వెలుగులో గ్రామం యావత్తు పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.

పామర్రు : పామర్రు పరిధిలోని అన్ని గ్రామాల్లో దీపావళి పర్వదిన వేడుకలు ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి తలంటు స్నానాలు ఆచరించుకుని సమీప దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటా, వాణిజ్య దుకాణాల్లో నూతన వెలుగులు ప్రసాదించాలని కోరుతూ నూతన వస్త్రాలు ధరించి శ్రీమహా లక్ష్మికి పూజలు చేశారు. జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జె అరుణ తన నివాసగృహంలో బంధువులు, కుటుంబ సభ్యులతో ఘనంగా దీపావళి వేడుకలను నిర్వహించారు. దీపావళి టపాసుల చప్పుళ్లతో పామర్రు మార్మోగింది.



పామర్రులో..

గుడివాడ : పేద ప్రజల మధ్య దీపావళి వేడుకలను బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) సోమవారం నిర్వహించారు. స్థానిక తట్టివర్రు రోడ్డులోని పేదలు నివాసముండే ప్రాంతానికి వెళ్లి పిల్లలకు మిఠాయిలు, దీపావళి టపాసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ అంటేనే చిన్నారులు ఎంతో సంతోషంగా చేసుకునే ముఖ్యమైన పండుగ అని అన్నారు. బీజేపీ నాయకులు రాంబాబు, గాదె చరణ్, పాల్గొన్నారు.



చిన్నారులకు దీపావళి టపాసులను అందజేస్తున్న ఆర్.కె

రైలు ప్రమాదంలో

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుడివాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గుడివాడ ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో రామవరప్పాడు-నిడమానూరు రైల్వేస్టేషన్‌ల మధ్యలో సుమారు 30సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ-నరసాపురం వెళ్లే రైలుబండి ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి ఛాతి ఎడమ వైపున రాధిక అనే పచ్చబొట్టు, ఎడమ చేతిపై శ్రావణి ఆర్ఎస్ఆర్ పట్టబొట్టు, కుడిచేతిపై అమ్మనాన్న అనే పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడు ఒంటిపై నలుపు రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆచూకీ తెలిసినవారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్సై సెల్ : 94406 27570, 98662 21412కు సంప్రదించాలని రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ తెలిపారు.

పేదలకు ఆహారం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు

● యలవర్తి శ్రీనివాసరావు

గుడివాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పేదలకు మరింత చేరువ అయ్యేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు రామకృష్ణ(నాని) పట్టణ ప్రజలకు నూతన ఒరవడిని తీసుకువచ్చి ఎప్పుడు ఆహారం అవసరమైన అందుబాటులో ఉండే విధంగా ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు రామకృష్ణ(నాని) కుమారుడు పృథ్వీ పుట్టినరోజు పురస్కరించుకుని నిత్యం పేదలకు అందుబాటులో ఆహారం నిల్వ చేసే ఫ్రిడ్జ్‌ను స్టేడియం బయట ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శుభకార్యాలు నిర్వహించే వారు మిగిలిపోయిన ఆహారం, దాతలు అందించే ఆహారం నిల్వ చేసేందుకు ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన వారు ఏ సమయంలోనైనా ఫ్రిడ్జ్‌ను తెరచి సరిపడా ఆహారాన్ని తీసుకోవచ్చునన్నారు. ఇది పూర్తిగా పేదల కోసం ఏర్పాటుచేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, పట్టణ సీఐలు కొండపల్లి శ్రీనివాస్, జేఆర్‌కే హనీష్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు దింట్యాల రాంబాబు, పెద్దు శ్రీకాంత్, జగన్మోహనరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహారం నిల్వ చేసే ఫ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

కార్తీకమాస పూజలకు శైవక్షేత్రాల ముస్తాబు

పామర్రు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పామర్రులో వేంచేసియున్న గంగాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయం కార్తీక మాసోత్సవంపురస్కరించుకుని ప్రత్యేకంగా తీర్చిదితున్నారు. పరమేశ్వరుడి ఆలయానికి కార్తీక మాసంలో జరిగే ప్రత్యేక పూజలకు వేకువజామునుంచే విశేషసంఖ్యలో భక్తులు హాజరౌతారు. భక్తులకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు ఆలయాధికారి జె. వేంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, ఇతరపూజలు నిర్వహిస్తామన్నారు. స్థానిక అయప్పసన్నిధనంలో కార్తీకమాస పూజలతోపాటు ప్రతి బుధవారం 15మందికి అన్నదానం కోసం ఏర్పాట్లను ఆలయ నిర్మాణదాతల సౌజన్యంతో సిద్ధం చేశారు.

గుడ్లవల్లేరు : శివాలయాలల్లో కార్తీక మాస ఆకాశదీపారాధనలు మంగళవారంతో ప్రారంభమయ్యాయి. గుడ్లవల్లేరు శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సంధ్యవేళ భక్తుల సమక్షంలో ఆకాశ దీపోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత పూజాకార్యక్రమాలు నిర్వహించి మహిళలు దీపాలను వెలిగించగా అర్చకులు కంఠమనేని శివరామకృష్ణ శర్మ, శేషగిరిలు ధ్వజ స్తంభానికి ఆకాశ దీపాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొసరాజు వెంకటాద్రి, అన్నే ప్రసాదరావు, ఎ.వీరబద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఏర్పాట్లతో సిద్ధమవుతున్న పామర్రు శివాలయం

ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

పామర్రు,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పామర్రులో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొంది తూర్పుగోదావరిజిల్లా అన్నవరం(శంఖవరం)కు వెళ్లినా కిషోర్ గుత్తికొండకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ దేనిలో రాజీపడకుండా ముక్కుసూటిగా వ్యవహరించిన వ్యక్తి గుత్తికొండ కిషోర్ అని పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాండ్రు జ్యోతి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో నందమూరి స్నేహలత, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీడీవో ఏవో మారుతిరావు, పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ సలీం, పూర్ణచంద్రరావు, పద్మశ్రీ వేణిలతోపాటు బోసు, నరేష్, ఉమా, పాల్గొన్నారు.



కిషోర్‌ను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భారత్‌పై ట్రంప్ సుంకాల పెంపునకు నిరసన

కూచిపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై ట్రంప్ సుంకాల పెంపునకు నిరసనగా ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు చినముత్తేవిలో రైతులు, కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు సెంటర్‌లో ట్రంప్ ఫ్లెక్సీలను దహనం చేశారు. భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులపై ట్రంప్ ఇటీవల పెంచిన సుంకాల వల్ల ప్రభావం పడకుండా, దేశ రైతాంగం నష్టపోకుండా భారత పాలకులు కృషి చేయాలని, ట్రంప్ విధానాలు నశించాలని నినాదాలు చేస్తూ ట్రంప్ చిత్రపటాలను దహనం చే శారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు, గ్రామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేములవాడ నాగ బసవయ్య, కడవకొల్లు మురళి, కమిటీ సభ్యులు విష్ణుదాసు సత్యనారాయణ, తూములూరు వీరయ్య, కూనపురెడ్డి వీరవసంతరావు, సూర్యనారాయణ, పామర్తి శ్రీనవాసరావు, సాయి, రైతులు పొనుకొల్లు లక్ష్మణరావు, కూనపురెడ్డి రాంబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.



చినముత్తేవిలో ట్రంప్ ఫ్లెక్సీలు దహనం చేస్తున్న కౌలు రైతు సంఘం నేతలు



గుర్రపుడెక్క, తూడుతో నిండిన పాలకోడు డ్రెయిన్

గుర్రపుడెక్కతో పూడుకుపోయిన పాలకోడు డ్రెయిన్

పెదపారుపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలకోడు డ్రెయిన్ గుర్రపుడెక్కతో పూడుకుపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. వెంట్రప్రగడ, వానపాముల, జమిదింటకుర్రు, అప్పికట్ల, జొన్నపూడి, పెదపారుపూడి తదితర గ్రామాలలోని పొలాలకు సరిగా సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకోడులో గుర్రపు డెక్క, తూడు కాడ తొలగించమని సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువతిపై దాడి

గుడివాడ : స్థానిక బాపూజీనగర్‌కు చెందిన నేరెళ్ల శాంతి ఈనెల 18వ తేదీ సాయంత్రం గేదెలను తోలుకుని ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బాపూజీనగర్‌లోని పొంగులేటి విజయకుమార్ తన ఇంటి వద్దకు గేదెలు రాగానే కర్రతో వాటిని కొట్టాడు. ఎందుకు కొట్టావని ప్రశ్నించడంతో తన మొక్కలు, దడులను ధ్వంసం చేస్తున్నాయని అంటూ శాంతిపై దాడి చేశాడు. గాయపడిన శాంతిని చికిత్సనిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోవరాజు తెలిపారు.

భద్రిరాజుపాలెంలో కోటి సంతకాల కార్యక్రమం

తోట్లవల్లూరు, అక్టోబరు 21 : (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరామర్శించలేదని, బాధిత రైతులకు న్యాయం చేస్తారా లేదా అని మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రశ్నించారు. భద్రిరాజుపాలెంలో మంగళవారం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దని కోరుతూ కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరి సీహెచ్ గవాస్కర్‌రాజు, సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ హేమలత, పెనముత్స రాధిక తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

గుడ్లవల్లేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు పోలీస్ స్టేషన్ ఆవరణలో నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ, దుర్గాంజనేయులు , ఏఎస్సై జి.వెంకటేశ్వరరావు, బాల వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించటం అభినందనీయమని పెదపారుపూడి ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పెదపారుపూడిలో హ్యాపీ డేస్ వృద్ధాశ్రమంలో బోధిసత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొని పేదలకు అన్నదానం చేసి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధిసత్వ ఫౌండేషన్ మురళీ సేవ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. వృద్ధులకు పోలీసు అమరవీరుల గురించి వివరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్, ట్రెజరర్ గంగాధర్‌రావు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు



అన్నదానం చేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి



బహుమతి అందుకుంటున్న కాగితాల జస్విత

డ్రాయింగ్ పోటీల్లో జస్వితకు తృతీయ బహుమతి

పమిడిముక్కల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కాగితాల జస్విత జిల్లా స్థాయిలో తృతీయస్థానం సాధించింది. మచిలీపట్నంలో జిల్లా వైద్య శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రూ. 2వేల నగదు బహుమతి జస్విత అందుకుంది. ఈసదర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్ఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు జస్వితను అభినందించారు.

అధ్వానంగా అతిథి గృహం

● దట్టంగా పెరిగిన చెట్లు
● విషపురుగులు, పాములకు ఆవాసం
● భయాందోళనలో ఉద్యోగులు



జిల్లా పరిషత్ అతిథి గృహానికి వెళ్లే దారి దుస్థితి

(ఆంధ్రజ్యోతి - గుడివాడ):చెట్లు, చేమలు దట్టంగా పెరిగి విషపురుగులు, పాములకు అవాసం కేంద్రంగా జిల్లా పరిషత్ అతిథి గృహ సముదాయం మారింది. పట్టపగలే పాములు ఇక్కడ సంచరిస్తూ ఉంటాయి. చిట్టడవిని తలపిస్తూ భయానకంగా మారింది. ప్రాంగణంలో ఉన్న పంచాయితీరాజ్ అధికారులు భయాందోళనలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాపలాగా ఉన్న వాచ్‌మెన్ కుటుంబం సైతం భయం భయంగా నివాసముంటున్నారు. జిల్లా పరిషత్ అధికారులు దీనివైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

ఊరి నడిబొడ్డున ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహ ప్రాంగణంలో పంచాయతీరాజ్ డీఈ, ఏఈ కార్యాలయాలున్నాయి. గతంలో అతిథీ గృహం వాడకలో ఉండేది. శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని మూసివేశారు. జిల్లా పరిషత్ అధికారులు పర్యవేక్షణ కొరవడంతో ప్రాంగణమంతా పిచ్చి చెట్లతో నిండిపోయింది. దీంతో పాములకు అవాసకేంద్రంగా మారింది. విషపురుగులు సంచారంతో ఉద్యోగులు భయాందోళనకు గురువుతున్నారు. పట్టపగలే విషపురుగులు కుడుతున్నాయని, తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే విధులు నిర్వర్తించాల్సి వస్తోందని, పంచాయతీరాజ్ ఉద్యోగులు వాపోతున్నారు. గత వైసీపీ పాలనలో జిల్లా పరిషత్ అధికారుల నిర్లక్ష్యంతో అతిథీ గృహం శిథిలావస్థకు చేరుకుంది.



పాత ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ఉన్న పొదలు



పంచాయతీరాజ్ డీఈ కార్యాలయానికి వెళ్లే దారి

సదరు ప్రాంగణానికి కూతవేటు దూరంగా ఉన్న ఆర్‌డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బాలాజీ పలుమార్లు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. కనీసం పక్కనే ఉన్న కోట్లు విలువ చేసే జిల్లా పరిషత్ స్థలం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



నగర సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళిక

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగర సుందరీకరణపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ తెలిపారు. మూడు స్తంభాల సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్, కోనేరుసెంటర్ తదితర ప్రాంతాల్లో అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. అసిస్టెంట్ కలెక్టర్‌తో పాటు కమిషనర్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మునిసిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



రావివారిపాలెం వద్ద గోతులు పడిన రహదారి



వెంకటాపురం వద్ద గోతులను చూపిస్తున్న వాహనదారులు





పాత నడకుదురులో నిమ్మగడ్డ లాకుల వద్ద వంతెనకు చేరుకునే అప్రోచ్ వద్ద భారీ గొయ్యి

గ్రామీణ రహదారుల్లో ప్రజలకు నరకం

● మోపిదేవి - పెదకళ్లేపల్లి రహదారి అధ్వానం

గ్రామీణ ప్రాంతంలోని రహదారులు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. పెద్దపెద్ద గోతులు ఏర్పడి, వర్షపు నీరు నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాహనదారులు, రైతులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు.

(మోపిదేవి - ఆంధ్రజ్యోతి)

మోపిదేవి నుంచి బోడగుంట, వెంకటాపురం, పెదకళ్లేపల్లి వరకు ఎనిమిదిన్నర కిలోమీటర్లు ఉండే జిల్లా పరిషత్ రహదారి అధ్వానంగా తయారైంది. పెదకళ్లేపల్లి వెళ్లే ఈ జిల్లా పరిషత్ రహదారిపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగించాల్సి వస్తుంది. వాహనాలు గోతిలో దిగి పైకి ఎక్కేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. వాహనదారులు గోతిలో పడి తీవ్ర గాయాలపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. గడిచిన కొన్ని సంవత్సరాలుగా రహదారికి మరమ్మతులు చేపట్టకపోవటంతో గోతుల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులు గాయాలపాలు కావాల్సి వస్తుంది. ఇప్పటికే వెంకటాపురం - పెదకళ్లేపల్లి రహదారిపై ప్రయాణాలు తాత్కాలికంగా నిలిపివేసిన వాహనదారులు కొంతమేర దూరమైనా మంగళాపురం, మేళ్లమర్రుల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు మోపిదేవి నుంచి రావివారిపాలెం, వెంకటాపురం, పెదకళ్లేపల్లి వెళ్లే రహదారి కి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాకపోకలు నిలిపివేస్తామంటున్నారు



పెదకళ్లేపల్లి, వెంకటాపురం, మోపిదేవి ప్రయాణాలు సాగించే బస్సులు, ఇతర వాహనాలు గోతులు పడిన రహదారిలో వెళ్లలేక కొద్ది రోజుల్లో నిలిపివేస్తామంటున్నారు. రహదారిపై పడిన గోతులు పెద్దవై ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంది. అధికారులు వెంటనే వెంకటాపురం వద్ద పడిన గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలి.

\- దాసరి సత్యనారాయణ

● ప్రమాదకరంగా నిమ్మగడ్డ ప్రధాన వంతెన అప్రోచ్

(ఆంధ్రజ్యోతి - చల్లపల్లి)



వంతెన మరో వైపున గొయ్యి

చల్లపల్లి మండలం నిమ్మగడ్డ లాకుల (పాత నడకుదురు) వద్ద కేఈబీ కెనాల్‌పై నిర్మించిన ప్రధాన వంతెనకు చేరుకునే అప్రోచ్ రోడ్డు గోతులు పడి వాహనదారులకు ఇబ్బందులను కలిగిస్తోంది. వంతెన దిగువన అప్రోచ్ రోడ్డు గోతులు పడటంతో వాహనాలు వంతెనపైకి చేరుకోవాలన్నా, కిందకు దిగాలన్నా ప్రమాదకరంగా మారింది. వంతెనకు శ్లాబు దిగువన మట్టి కుంగి అగాధం ఏర్పడడంతో ఒకవైపునే రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ రాకపోకలు సాగించే వారు నడకుదురు రోడ్డు తర్వాత ఈ వంతెన మీదుగానే కరకట్టకు చేరుకుంటారు. దేవరకోట, వక్కలగడ్డ, యార్లగడ్డ, నిమ్మగడ్డ మీదుగా కరకట్టకు చేరుకునేలా బీటీ రోడ్డు నిర్మించటంతో ఆయా గ్రామాల నుంచి విజయవాడ ఈ మార్గం మీదుగా వెళ్తుంటారు. నిత్యం ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఆటోలు ఇతర వాహనాలు నిమ్మగడ్డ లాకుల వద్ద వంతెనమీదుగా కరకట్ట చేరుకోవాల్సి ఉంటుంది. అప్రోచ్ రోడ్డు గోతులు పడటం, వంతె ఒకవైపున శ్లాబ్ కింద గొయ్యిపడటం వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. వంతెన సమస్యకుతోడు కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఆరో నెంబరు పంట కాలువపై ఉన్న రోడ్డు ప్రమాదకర స్థితికి చేరుకుంది. భారీ వాహనాలు కా లువమీదుగా రాకపోకలు సాగించటంతో రోడ్డుకుంగిపోయింది. కింది భాగంలో ఉన్న స్ట్రక్చర్‌కు, రోడ్డుకు కొంత గ్యాప్ ఉండటంతో ప్రస్తుతం రోడ్డు మాత్రమే కుంగింది. భారీ, లోడు వాహనాల రాకపోకలు అధికమైతే పూర్తిగా కుంగిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే కరకట్ట నుంచి నిమ్మగడ్డ, యార్లగడ్డ, వక్కలగడ్డ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. దేవరకోట వయా నిమ్మగడ్డ రహదారి నిర్మించినపుడు శ్లాబు కల్వర్టు నిర్మిస్తారని భావించినప్పటికీ నిర్మాణం చేయలేదు. పంటకాలువపై పటిష్టమైన శ్లాబ్ కల్వర్టును నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి, అప్రోచ్ రహదారికి తక్షణం మరమ్మతుల చేయాలని, పంట కాలువపై వంతెన నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

నాగాయలంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏటిమొగలో రొయ్యల చెరువు వద్ద పని చేసే పశ్చిమ బెంగాల్‌కు చెందిన కృష్ణడో మొండల్ (33) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సుమారు 6 నెలలుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 19వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

కోడిపందెపురాయుళ్ల అరెస్టు

నాగాయలంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం కరకట్ట కింద కోడి పందాలు వేస్తున్న 17 మందిని ఎస్సై కె.రాజేష్ పట్టుకున్నారు. వారి వద్ద రూ.41,80, రెండు కోడిపుంజులు, నాలుగు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు.

పేర్ని కుటిల రాజకీయాలను మానుకోవాలి : లకనం

నాగాయలంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్రను వ్యక్తిగతంగా దూషిస్తే సహించేది లేదని అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘాల నాయకులు మాజీ మంత్రి పేర్నిని హెచ్చరించారు. అగ్నికుల క్షత్రియ కులానికి చెందిన మంత్రి కొల్లు రవీంద్రను వాడు, వీడు అంటూ అసభ్యపదజాలంతో దూషించడం సబబు కాదన్నారు. రాష్ట్రంలోని 80 లక్షల మంది అగ్నికుల క్షత్రియులకు ఆయన నాయకుడన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తదితరులు హితవు పలికారు.

వేమూరి వెంకట సుబ్బయ్యకు ఘననివాళి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో హోటల్ రంగానికి వీవీఎస్ సంస్థల వ్యవస్థాపకుడు వేమూరి వెంకట సుబ్బయ్య ఆద్యుడని వక్తలు పేర్కొన్నారు. వేమూరి వెంకట సుబ్బయ్య సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. వేమూరి సుహాస్, లంకిశెట్టి బాలాజీ, అడపా రత్నాకర్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్తరెడ్డిపాలెంలో దివ్యాంగుడు మర్రి సుబ్బారెడ్డికి మంగళవారం స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నీలపాల ఫణి, ఐనాల సుధాకర్, కొడాలి మణిబాబు, టి. మాణిక్యాలరావు, నాగబాబు, జి. భాను, కె.నరసింహమూర్తిరెడ్డి, రామకోటేశ్వరరెడ్డి, విక్రమరెడ్డి, ఏడుకొండల రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

పెడన, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పెడన మండల కమిటీ ఆధ్వర్యంలో కొల్లూరి పుల్లయ్య ధర్మసత్రం ఆవరణలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా అమావాస్య రోజున పేదలకు అన్నదానం చేయాలని నిర్ణయించామని సమితి అధ్యక్షుడు కేటి మురళీకృష్ణ తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో సమితి సభ్యులు కొల్లూరి రాధాకృష్ణ, ఆత్మకూరి సురేష్, కోడూరి రమేష్, బవిరిశెట్టి నాగేశ్వరరావు, కొల్లూరి రాజా పాల్గొన్నారు.



పోలీస్ అమరులకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పోలీసు అమరవీరులకు నివాళి

అవనిగడ్డ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి త్యాగాల ఫలితంగానే దేశంలో శాంతి నెలకొందని దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అవనిగడ్డలో పోలీసు అమరవీరుల స్థూపం చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పోలీసు అమరులకు నివాళులర్పించారు. టీడీపీ నేతలు బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, ఘంటసాల రాజమోహనరావు, మండలి రామ్మోహనరావు, మండలి శివ, దాసినేని శ్రీనివాసరావు, అడపా శ్రీను, బచ్చు హనుమాన్, మెగావత్ గోపి, కంచర్ల ఆనంద్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న చల్లపల్లి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకరరావు, మాధవేంద్రరావు

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

చల్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన హర్షణీయమని ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు తోట సుధాకరరావు, పివి. మాధవేంద్రరావు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ, దీపావళి పండుగ కానుకగా నవంబరు నెల నుంచి ఒక డీఏ విడుదలకు, 60 రోజుల్లో హెల్త్‌కార్డ్ సక్రమంగా పనిచేసేలా కమిటీని ఏర్పాటుచేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించటం, ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు ఉత్తర్వులు జారీ చేస్తామనటంపై హర్షం వ్యక్తం చేశారు. చైల్డ్‌కేర్ లీవ్‌పై మహిళా ఉద్యోగులు సంతోషిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రివర్గ ఉపసంఘానికి, అసోసి యేషన్ అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులు కె.రామకోటేశ్వరరావు, నందం బాబూరావు, వి.రాంబాబు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ భానుమూర్తి

సెల్‌ఫోన్ వాడకంతో కంటి సమస్యలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పిల్లల నుంచి పెద్దల వరకు గంటల తరబడి సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారని, దీని వల్ల నేత్ర దృష్టి బలహీనపడుతుందని ప్రభుత్వ నేత్ర వైద్యుడు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధి డాక్టర్ జి. భానుమూర్తి అన్నారు. ఇంగ్లీషుపాలెం ఉర్దూ షాదీఖానాలో మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్, మోడ్రన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో డాక్టర్ జి. భానుమూర్తి నేత్ర పరీక్షలు నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ కాగిత రాకేష్, డాక్టర్ పరసా లక్ష్మీభావన, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరసా మధుసూదనరావు, మోడ్రన్ ఐ కేర్ యాజమాని ఎండీ నియాజ్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఈవో యార్లగడ్డ వాసు

గ్రామసభ రసాభాస

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈవో యార్లగడ్డ వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ రసాభాస అయ్యింది. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం, భోజన శాల నిర్మించాలన్న ఆలోచనతో ఈవో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పలువురు దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కల్యాణ మండపం ఆలయానికి వెలుపల నిర్మించాలని ఒక వర్గం, ఆలయ ప్రాంగణంలోనే నిర్మించాలని మరో వర్గం పట్టుపట్టారు. భోజన శాల విషయంలో కూడా ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరగటంతో ఈవో సమావేశాన్ని అర్ధాంతరంగా వాయిదా వేశారు. ఈవో యార్లగడ్డ వాసు విలేకరులతో మాట్లాడుతూ, ఈ విషయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.



రోడ్డు వెంబడి జంగిల్ క్లియరెన్స్

నాగాయలంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తలగడదీవి - టి.కొత్తపాలెం జడ్పీ రహదారిని ముళ్ల చెట్లు మూసేశాయి. తలగడదీవి జడ్పీ పాఠశాలకు టి.కొత్తపాలెం నుంచి సైకిళ్లపై నిత్యం విద్యార్థులు వెళ్లి వస్తుంటారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు తలగడదీవి గ్రామస్థుడు భోగాది హరికృష్ణ ఎక్స్‌కవేటర్‌తో జంగిల్ క్లియరెన్స్ పనులను చేయించి విద్యార్థులు, ఇతరు గ్రామాల ప్రజలకు సౌకర్యాన్ని కల్పించారు.



పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎస్సై ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరరావు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఘంటసాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి సహాయం అందించటం అభినందనీయమని ఎస్సై ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు అన్నారు. చిట్టూర్పు గ్రామంలోని మూడు ఎంపీపీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గ్రామ ప్రముఖులు వక్కలగడ్డ శ్రీనివాసరావు సమకూర్చిన విద్యాసామాగ్రిని మంగళ పంపిణీ చేశారు. 60 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. గ్రామ ప్రముఖులు దాసరి బసవ కుటుంబరావు, బూసి సుబ్రహ్మణ్యం, మల్లంపల్లి హేమాద్రి, పోతార్లంక శివ వెంకట రత్నం, సాయి, కొండ, సామేలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై మంగళవారం వైద్య సిబ్బంది మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన కల్పించారు. జిల్లా వైద్య శాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి ఆధ్వర్యంలో హెచ్ఎస్ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ రాజా హరిగోపాల్, సీహెచ్‌వో భవాని, ఏఎన్ఎం సోవమ్మ ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.



కొడాలి జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

ఘంటసాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు తమవంతు సాయమందించారు. కొడాలి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు జాస్తి కిషోర్ రూ.1,20,000, కోడె శ్రీరామకృష్ణ రూ.50 వేలు ఆర్థిక సాయంతో రంగులు వేయించి, ర్యాంప్ ఏర్పాటు చేశారు. కంప్యూటర్, ప్రింటర్, బీరువా, చైర్స్, వాటర్ క్యాన్స్ అందించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పోతన లక్ష్మేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యాకుటుంబం ధన్యవాదాలు తెలియజేశారు.



చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

చల్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థినిలు వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుడివాడలో జిల్లాస్థాయి పోటీలు జరుగనున్నాయి. అండర్ - 17 సీనియర్ విభాగంలో కుంచె దివ్య, జూనియర్ విభాగంలో అద్దంకి హారిక, దుర్గాశ్రీవల్లి, అశ్విని, సుస్మిత ఎంపికయ్యారు. హెచ్ఎం సుదర్శన్‌ప్రసాద్, పీఈటీ శ్రీనివాస్, రేణుప్రసాద్, శాస్త్రి అభినందించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినిలకు చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో టీ షర్టులను అసోసియేషన్ వ్యవస్థాపకులు టి.సాంబశివరావు బహూకరించారు.



బహుమతులందజేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరావు

లింగారెడ్డిపాలెం విద్యార్థినుల ప్రతిభ

కోడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి డిబేట్ పోటీల్లో లింగారెడ్డిపాలెం జడ్పీ విద్యార్థినులు రెండో స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం నాగరత్నకుమారి తెలిపారు. గాదె కావ్య, కడవకొల్లు హేమాంజలి ప్రతిభ చూపగా జిల్లా వైద్యఆరోగ్య అధికారి అంబటి వెంకటరావు నగదు బహుమతిని అందించారన్నారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కోటి సంతకాల సేకరణ రేపటి నుంచి : సింహాద్రి

అవనిగడ్డ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక నుంచి కోటి సంతకాల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అబద్ధాలు చెబుతున్నారని, కరకట్టను దివంగత మాజీ మండలి వెంకట కృష్ణారావే తీసుకొచ్చారని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కరకట్ట కోసం మాజీ ఎంపీ సనకా బుచ్చికోటయ్య కృషి చేసిన విషయం తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులందరికీ తెలుసన్నారు. సింహాద్రి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, బాలభాస్కరరావు, జై గోపాల్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

మచిలీపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కార్యవర్గ ప్రమాణ స్వీకారం రేపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అధ్యక్షుడిగా ఐ. దిలీప్‌కుమార్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఛైర్మన్‌గా ఐ.దిలీప్ కుమార్‌తో పాటు డైరెక్టర్లుగా వేము కోటేశ్వరరావు, నూకల రమాదేవి, గెల్లి అరుణకుమారి, వంపుగడల చౌదరి, పోతాబత్తుల పాం డురంగారావు, సూరిశెట్టి హరికృష్ణ, బొర్రా శ్రీనివాస్, గున్నం నాగరాజన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు జిల్లా పరిషత్ సెంటర్‌లోని వినాయకుడి గుడి నుంచి అర్బన్ బ్యాంకు వరకు ర్యాలీగా వెళ్లి ప్రమాణ స్వీకార చేస్తామని దిలీప్‌కుమార్ తెలిపారు.

కార్తీక మాసోత్సవాలు నేటి నుంచి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి రోజూ సాయంత్రం కార్తీకపురాణం పఠనం, విద్యార్థులకు ప్రతి సోమవారం వివిధ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పాలక మండలి ఛైర్‌పర్సన్ దేసు నీరజ, కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయ స్వామి తెలిపారు. కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, గొడుగుపేట శాంతా మల్లేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీకమాసం సందర్భంగా ఉదయం పూట స్వామి వారికి మహాన్యాస పూర్వక నమక చమకాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్య నిర్వహణాధికారులు తెలిపారు.